


# ఆశల కుంపటి

ఇంద్రగంటి
శ్రీకాంత్ శర్మ

చీకటి చీకటిగా ఉంది.

ఉండి ఉండీ ఒక మెరుపు మెరవడంతో, పరిగెత్తిపోయే మబ్బుకీ నిలిచిఉన్న మబ్బుకీ మధ్య ఓముక్క ఆకాశం కనిపిస్తోంది

వర్షంకురిసి ప్లాట్‌ఫారం అంతా జల్లు కొట్టి సగంమేర తడిసింది.

ఔటర్ సిగ్నల్‌వాలి, మెయిల్ వస్తోంది. జనం హడావిడిగా సామాన్లు పట్టుకుని అటూ ఇటూ పరుగెడుతున్నారు.

ఓవర్ బ్రిడ్జిమీదనుంచి ఇద్దరు స్టేషను కుర్రాళ్ళు గుద్దుకుంటూ, తుమ్ముకుంటూ, పైనించి నడిచివచ్చే మనుష్యం తిట్లకి కొంటెగా వెక్కిరిస్తూ పరుగునవస్తున్నారు నవ్వుకుంటూ—

మెయిల్ వచ్చి ఆగింది.

జనం సర్దుకుంటున్నారు. వాళ్ళమధ్య నించి పరిగెట్టిన ఆ ఇద్దరు కుర్రాళ్ళనీ ఎవళ్ళో ఆడవాళ్ళు తిట్టుకుంటూన్నారు; తమ బట్టలమీదికి నీళ్ళు చిమ్ముతూ పరిగెట్టినందుకు—

పోలీసు ఒకడు ఆ కుర్రాళ్ళనిద్దర్నీ జుట్టుపట్టుకు తన్ని, తగిలేశాడు

ఒకడు బయటికి పరిగెట్టుకు పోయాడు. వాణ్ణి అంతా 'నూరిగాడు' అని పిలుస్తారు—

రెండోవాడు ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటుదగ్గర నిలబడి, బయటకుచూసే ఉత్తరాది శేట్‌జీలనీ, వాళ్ళనీ ముష్టెత్తుతున్నాడు డబ్బులిమ్మని—

చింపిరిజుట్టు—

ఒకపక్కనే పూర్తి గుడ్డఉన్న నిక్కరు.

వీపుమీద సగంమేర చినిగిపోగా, మరో రంగుగుడ్డవేసి అతికినచొక్కా.

ఈ వేషంతో అవతారం ఎత్తిన పదమూడేళ్లవాణ్ణి 'గుండుగాడు'అంటారంతా—

ఏ ముహూర్తంలో ఎవరు వాడికి గుండు చేయించి పుణ్యం కట్టుకున్నారోగాని, ఇప్పుడు గుండు లేకపోయినా వాడిపేరు మాత్రం 'గుండుగాడు' అనే స్థిరపడిపోయింది.

మెయిల్ వెళ్ళిపోయింది.

చేతిలో నలభై పైసలు పడ్డాయి.

గుండుగాడు ఔట్‌గేట్‌వైపు పరిగెట్టాడు. చర్రుమని దూసుకుపోయాడు—

గుండుగాడికి 'గతం' గురించి తనని ఎరిగినవాళ్ళకి ఏం తెలుసో, వాడికీ అంతే తెలుసు.

రంగురంగుల బట్టలూ—

రంగురంగుల అట్టల హిగ్గిన్‌బాదమ్స్ పుస్తకాల షాపూ—

పొడుగాటి రైలుబళ్ళూ. వాటి అరుపులూ, పొగా—

మోగే గంటలూ—

తనలాగే పుట్టి, పెరిగి, అటు ఇటూ తిరగడంలో ఎదురైన, కాలువిరిగిన కుక్కా.

ఈ మహాప్రపంచం మినహా, మరొకటి ఎరగడు—

నూరిగాడు వీడికి స్నేహితుడు. వాడెరు

గునో ఎరగడోగాని, వాళ్లమ్మపేరు ఎల్లమ్మ అని మాత్రం చెబుతాంటాడు. అప్పుడప్పుడు గుండుగాడికిమాత్రం బాధవేస్తాంటుంది, తను ఎవరిపేరూ చెప్పలేకపోవడం— గుండుగాడు బయటికి వెళ్లేటప్పటికి, సూరిగాడు దూరంగా కనిపించాడు బీడీకాలుస్తూ.

అక్కడ, గోడమీద సినిమా పోస్టరు అతికిస్తోంటే చూస్తున్నాడు

సూరిగాడు వెనక్కి తిరిగి, గుండుగాణ్ణి తప్పట్లుకొట్టి పిలిచి, వాడి మెడమీద చెయ్యివేసి—'అరేయ్ గుండూ. సూడ్రా... హబ్బ బలేబొమ్మ—యేల్దాం వా. మరి య్యాల...' అన్నాడు

గుండుగాడి చేతిలోంచి డబ్బులు తీసుకొని, తన జేబులో డబ్బుల్తో కలిపాడు సూరి—తొంభై పైసలు!—

'సినిమాడబ్బులు కిట్టాయి—' సూరి ఈలవేశాడు

'మరి. ఆకలో.' గుండుగాడు నీరసంగా చూశాడు

'ఆకలా—ఓ రెదవా—మూడ్రోజులుండి పోగల్ను తెల్సా.' అన్నాడు సూరి పౌరుషంగా.

'నానూ ఉండగల్నోయ్ రెండ్రోజులైపో నాదిగా ప్రొద్దే సిదెపో-పకోడీలు అణాయి కొనుక్కుని తింటే!' గుండుగాడు నీరసంగా ఆశగా చూశాడు సూరిగాణ్ణి సూరిగాడు కొంచెంపెద్దవాడికంటే—

దూరంగా హోటల్ విస్తరాకుల కుండీ దగ్గిర కుక్కలతో సమంగా పోరాడుతూ అన్నం ఏరుకుని విస్తళ్లలో పెట్టుకున్న వాళ్లకేసి చూసి, సూరిగాడు అసహ్యంగా అన్నాడు

'పందులు—ఛీ'—

'ఏవి?' గుండుగాడు చుట్టూ చూసి, అడిగాడు—

'అవిగో—మనిషిపందులు!' అన్నాడు సూరి.

వాడికీ ఆకలి వేస్తోంది. సూరిగాడికి కోపం వచ్చింది

ఆ విస్తరాకుల కుండీకేసి పరిగెత్తి కుక్కని బెడ్డవేసికొట్టాడు అది ఎగిరి ఆ అన్నంపెట్టుకున్న వాళ్లమధ్యపడింది. చెదరగొట్టేసింది

సూరిగాడు హాయిగా నవ్వాడు గుండుగాడి చెయ్యిపట్టుకుని, స్టేషన్వైపు పరిగెట్టాడు— కుండీదగ్గిరవాళ్లు తరుముకొస్తోంటే—

వర్షం మళ్లీ మొదలై, జోరెక్కింది

'సూరీ, రేపంట్రా బొమ్మ—ఇయ్యాల కాదు'

'ఛ!'

'సూడు—పేర్రాజు సెప్పాడు'—అన్నాడు గుండుగాడు

పేర్రాజు పుణుకుల కొట్టుదగ్గిర చేరిన రిక్షావాళ్లూ, జట్కావాళ్లూ చెప్పారు సూరిగాడికి — నాటు బూతుమాటలతో— ఆ సినిమా రేపటినించి అని—

ఓఅర్ధరూపాయిదాచి, నలభై పైసలతో తిని, తాగి, స్టేషన్లోకి పరుగెత్తారు ఇద్దరూ—

వర్షంతోపాటు చలీ ఎక్కువైంది సీవర్ బ్రిడ్జికింద గూడులో గోనెపట్టాని దులిపాడు సూరి—

కుంటి కుక్కపిల్ల కుంయోమంది.

బెజవాడనించి, వాల్తేరుపోయే గుడ్సు సరాసరిగా, వేగంగా దూసుకుపోతోంది—

గూట్లోదూరి, కుక్కపిల్లని మూలకి తోసేశారిద్దరూ—

కబుర్లు కరిగిపోయి, ఒరిగి నిద్రపోయారు.

* * *

సినిమా జరుగుతోంది

పెద్ద జమీందారు ఆయనకో భార్య— వాళ్లకో చిన్నకొడుకూ—

అంతా గొప్ప గొప్ప వాళ్లు మేడలెక్కేస్తూ, దిగేస్తూ, కార్లెక్కేస్తూ వెళ్లిపోతూ—నవ్వేస్తూ—ఏడిచేస్తూ—

సినిమా తమాషాగా అనిపించింది గుండుగాడికీ—సూరిగాడికీను—

మరో రెండురీళ్లు దిగేటప్పటికి పెద్ద తిరనాళ్లలో జమీందారుగారబ్బాయి తప్పిపోయాడు—

సినిమా చివర్ని హీరోయిన్, హీరో ప్రేమ విఫలం కాబోతుంటే, హీరో వీపుమీది 'పుట్టుమచ్చ'వల్ల నిజం తెలియడం— జమీందారుగారూ, హీరో, హీరోయిన్, హీరోయిన్ తండ్రీ మొదలైన వాళ్ల ఆనందభాష్పాల గ్రూప్ ఫోటోతో, సినిమా పూర్తయిపోయింది.

గుండుగాడు ఆశ్చర్యంతో మధ్యమధ్య లేచి నిలబడిపోతూ సినిమా అంతా చూశాడు.

బికారివాడిలా కనిపించిన కుర్రాడు హీరో అయిపోయి జమీందారుగారి అబ్బాయికూడా అయిపోయి, గొప్ప గొప్ప మాటల్లోనుకుని తిరగడం బలే వింతగా అనిపించింది

గుండుగాడు, ఆట వదిలాక సూరిగాడి కోసం చుట్టూ వెదికాడు. వాడు, ఫాడా కుర్రాడితో దూరంగా కనిపించాడు—

గుండుగాడు దగ్గరగావెళ్లి—

ఒబ్బ ఏం బొమ్మరా!—. సూరీ సోడా కొట్లోకి పోతావా, ఆడితో సేవితం పట్టావు!' అన్నాడు

'నీకు తెల్దులే—ఆడితో సేవితం సేత్తే ఆడు సినేమాలు ఊరికే సూబిత్తాడు!' అన్నాడు సూరి—

'వరే, యెవ్వడా — ఆడి తాతగారిదేంటి?'

'అవున్రా యెదవా, అవును ఈ శ్లీవళ్లకి తెల్దు ఈడు ఈ హాలోళ్ల కుర్రోడేనంట. ఆడే సెప్పాడు -ఇట్టా వుంటన్నాడంట—ఇయ్యాల బొమ్మ సూశాడుగా, ఇంక సెబులాడంటలే—'

'ఏందని—'

'ఓ మెర్రి వాయనల్లార్రా, నేను మీ వోణ్ణి ఇయిగో గుర్తులు అని-ఈడి యీమ్మీదకూడా మచ్చుందిలే-సూబిత్తాడంట అప్పుడింక సేరదీయక యేంచేత్తారు?'

'అబద్దం'

'ఓ రెదవా, సినేమా అబద్దమున్న పిచ్చోణ్ణి నిన్ను సూశా— నా దగ్గరంటే అన్నావుగాని, ఇంకెక్కడా అనబోకు-సినేమా అంటే సత్తె ప్రెమాణికంగా పాటిగ్గాసే పెట్టి తీత్తారు—'

'ఈడు కోశాడేమో!'

'కొయ్యడేంట్రా — నేను సూశాన్రా మచ్చని—'

గుండుగాడు అంతా విని అన్నాడు.

'ఒరే, సూడ్రా, నా యీమ్మీదుందా మచ్చ!'

సూరిగాడు, గుండుగాడి వీపుమీదచరిచి, 'అమ్మ. ఎంతాశరా యెదవా, నా యీమ్మేదీ లేదు, ఇంక నువ్వేంటి మహా! నా వెల్లమ్మకొడుకునే — నువ్వెవడివో ఆ పుట్టించి నోడికి తెలియాలి!' అన్నాడు.

గుండుగాడి కేడుపొచ్చింది—

సూరిగాడు బూమాటుగా మాట్లా చేస్తున్నాడు. డాన్సు, ఫైటు, పాట, అన్నీ మ్యూజిక్‌తోసహా ఇమిటేట్ చేస్తున్నాడు. గుండుగాడికి మాత్రం ఇదేమీ వినిపించటం లేదు.

తన అమ్మా నాన్న ఎవరు? సూరిగాడు అలా అన్నాడేవిఁటి?— ఆలోచిస్తున్నాడు—

వాడి మొహం— ఆ వెధవకి కుళ్ళు తనెక్కడ గొప్పవాడయిపోతాడో అని—సూరిగాడు ఏడవాలంటే ఏమెయిలుబండి దగ్గరో

# ఆశలకుంపటి

ఏడ్చూ ఓసు కున్నాయవో—ఇవాళ సినిమాలో లాగ—తనని జారదీస్తే ఈ సూరిగాడు—వెధవ—కుళ్ళికుళ్ళి ఏడుస్తాడు—

గుండుగాడు గాలిమేడలు కడుతున్నాడు.

సూరిగాడు, తుపాకులూ, పేలడం, పరిగెట్టడం దూకడం—చెప్పేకు చెప్పేకు మురిసిపోతున్నాడు.

గుండుగాడు తన మనస్సులో దూరి




పోయాడు.

ఇద్దరూవచ్చి ఓవర్ బ్రిడ్జికింద పడుకున్నారు.

* * *

మూడురోజులు గడిచాయి.

ఆరోజంతా సూరిగాడు కనిపించలేదు.

అన్నం పొట్లంకొని సగం తిని మిగతా సగం ఎంతకి సూరిగాడు రాకపోవడంతో గుండుగాడు కుంటికుక్కకి పడేశాడు.

తనుచూసిన సినిమాలో జవిూందారు బికారి పిల్లాడు జమీందారుగారి అబ్బాయి అయిపోవడం ఇప్పటికీ వింతగాఉంది గుండుగాడికి.

వాడు ఒళ్ళంతా చూసుకున్నాడు ఏవన్నా మచ్చలున్నాయేమోనని.

సూరిగాడు ఒకసారి కోపంవచ్చి చుట్టతో కాల్చేసినమచ్చ—ముంజేతి మీదిది—తప్ప ఇంకేమీ లేవు.

రాత్రి పదిదాటింది—గంట మోగింది.

ఒక అరగంట గడిచింది బండివచ్చి ఆగింది.

ఏంబండిచెప్మా! అని గుండుగాడు పరిగెట్టాడు. అది మద్రాసునించి హౌరా పోయే ఎక్స్‌ప్రెస్ లేటయింది—

గుండుగాడు గబగబ బండికి ఈ చివర్నించి ఆ చివరకి పరిగెట్టాడు. ఫస్టు క్లాస్ కంపార్టుమెంట్లలోకి— స్టేషను దీపాల వెలుగులో తొంగి తొంగి చూస్తున్నాడు' ఆశగా దీనంగా ఉన్నాడు.

ఒక కంపార్టుమెంటులో ఆమె ఎవరో వాణ్ణిచూసి నవ్వింది. పరిగెట్టుకువెళ్ళాడు దగ్గిరగా—ఆవిడ ఒక పదిపైసలబిళ్ళ కింద పడేసింది. రైలు కదిలింది.

ఉసూరుమన్నాడు గుండుగాడు. పదిపైసలు తీసుకున్నాడు.

పాయంత్రం జంతికల జంగిడీ రావన్న చెప్పాడు—సూరిగాణ్ణి పోలీసులు పట్టుకు తన్నారట.

పొద్దుట ఇంగ్లీషుమాట్నీ హాలుదగ్గిర ఎవరిదో పర్సుకొట్టేస్తే ఆయనే పట్టుకుని పోలీసుని పిలిచి అప్పగించాట్ట. పోలీసు ఉతికేశాడో, కటకటాల్లోపారేశాడో ఏమో! అనుకున్నాడు గుండుగాడు—సూరిగాణ్ణి చూడాలనిపించింది వాడికి—ఏడుపొచ్చింది. సూరిగాడు లేడనగానే—తనే గనక ఎవరితాలవాకోలయి తనని ఆదరిస్తే

ఈపాటికి వాళ్ళతో చెప్పి, మూరిగాణ్ణి విడిపించకపోవా! అనుకున్నాడు మళ్ళీ, మూరిగాడిబుద్ధి మంచిదికాదని పించింది.

జంగిడీర్రావన్న తెగ తిట్టాడు.

'ఓ రెదవా ఆడిలాగే నిన్ను సావబొడిచెయ్యగలరు పోలీసోళ్ళు—' అని. గుండుగాడికి భయంవేసింది.

మూరిగాణ్ణి పోలీసులు పట్టుకుపోవడమే మంచిదనుకున్నాడు మళ్ళీ. లేకపోతే ఎవళ్ళనా గొప్పవాళ్ళు తనని తీసుకుపోతోంటే కుళ్ళుమోతు పీనుగ అడ్డువడేవాడు!—అనుకున్నాడు.

* * *

రెండురోజులు గడిచాక ఓరోజు అర్ధంరాత్రివచ్చి తనపక్కలో దూరితే, మూరిగాణ్ణి చూసి ఉలిక్కిపడ్డాడు గుండుగాడు—

వాడుగోడవంతా చెప్పాడు. వాడి మొహం ఇంతలావుగా అయిపోయింది. ఏడిచాడో ఏమో ఇంకా వెక్కుతునే ఉన్నాడు.

ఏదో ఇంగ్లీసు సినిమాకి వెళ్ళాడట. అందులో 'వాడెవడో' అందరినీ మోసగించి బలే మస్కావేసి ఎంతమందినో తన్నేసి, కాల్చేసి, పొడిచేసి, రైలునడుస్తూ వుంటే పెట్టెలనుంచి దూకి పారిపోయాడట—పోలీసుల్ని ఏడిపించి—

మరి తను పర్సు కొట్టేసినప్పుడు పెద్దవాళ్ళు ఎలా చూశారో అర్థం కాలేదట. ఈపారి ఏదేనా అలాంటి దొస్తే 'వాడిలాగే రైలుపెట్టెలనుంచి దూకి పారిపోయి, అందర్నీ ముప్పతిప్పలు పెట్టేస్తా'నని చెప్తున్నాడు మూరిగాడు—

'యెదవలు . . కుక్కలుకూడా నంట! ఆపోలీసోళ్ళ కుక్కలికి మాత్రం దొరుకుతావేంటి! ఈపాలేదో తప్పుగా నూసుంటాను. సినేమా వోళ్ళకంటే, ఒకా ళ్ళక్కువేంటమ్మా!...యెక్కువేంటి'—ఏడుపు దిగమింగుకుంటూ తనని తనే గద్దించుకుని, ధైర్యం చెప్పుకున్నాడు.

గుండుగాడు విని విస్తుబోతున్నాడు వాడిబాధ వాడిది. 'మూరిగాడు తనకి అడ్డు తగిలితే!' అని!—

మర్నాడు జంతికిల రావన్నా హోటలు అయ్యరూ, స్టేషన్ గంట కొట్టేవాగన్నా మూరిగాణ్ణి పరామర్శించి, హెచ్చరించారు. తిట్టారు. తనకీర్తి యింతమందికి తెలియగానే మురిసిపోయాడు మూరిగాడు—

'నూస్కి - సినిమాలో 'ఆడి' గురించి అచ్చుపేపర్లోకూడా నూచించాడు. నూడు మరి ఒకాపాలి...' గర్వంగా గుండుగాడికేసి చూసి నవ్వేడు మూరిగాడు.

* * *

మరొక నాలుగురోజులు గడిచాయి. గుండుగాడు ఖరీదైన రైలుబళ్ళ దగ్గర


యూ'బ్రిజిల్'కొనల్ని
భూతద్దము
క్రింద పోల్చి
చూడండి



బినాకా
టూత్ బ్రష్
క్షేమకరమైన 'గుండ్రని
బ్రిజిల్'కొనలతోకూడి
చిగుళ్లను
తెగనీయదు

CIBA

పరిశుభ్రముగా తోమండి
క్షేమకరముగా తోమండి
బినాకా తో తోమండి

ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ల దగ్గర నిలబడి, ఆశగా అన్వేషించడం మానలేదు ఎత్తైన మేడకేసి, స్టేషన్‌కి వచ్చే ఖరీదైన కార్ల కేసి చూసి 'బహుశా వీటిల్లో మనవి ఏవో తెలుసుకునే రోజు రాకపోదు' అనుకోవడం మామూలై పోయింది.

సూరిగాడు ఒక్కడే సినిమాలకి పోతున్నాడు ఏ రాత్రో వచ్చి, గుండుగాడి పక్కలో దూరి ఏవేవో గొడవలు చెప్పడం మానలేదు.

గొప్పవీరుడికి ఒక కుక్క కూడా ఉండటం చాలా అవసరమని గుర్తించి, కుంటి కుక్క పోషణాభారాన్ని సూరిగాడు వహించాడు.

దానికేసి, దాని అభివృద్ధి అంతా కళ్లల్లో మెరుస్తున్నట్టు చూస్తూ రోజులు గడుపుతున్నాడు—

గుండుగాడు, తను చాలా పెద్ద కుటుంబం వాడినన్న ఉద్దేశం కల్గాన్నే, మెగతా చిన్నచిన్న టీకుర్రాళ్లనీ, వాళ్లనీ అంతగా పలుకరించకండా, తనకి తనవాళ్లు చేరే రోజు కోసం ఎదురు చూస్తున్నాడు

* * *

తెల్లారబోయే సమయాన—ఏదో రైలు వచ్చి ఆగింది.

ఇంకా చీకటి చీకటిగానే ఉంది.

# ఆశాకుంపటి

ఎవళ్ళ వాళ్లో దిగి హడావిడిగా వెళ్లి పోతున్నారు.

రైలు వెళ్లిపోయింది

గుండుగాడికి మెళుకువ వచ్చింది సూరిగాడు లేడు. చాలా నీరసంగా ఉంది—

బడలికం, నిద్ర, నీరసం, కళ్లరెప్పల్ని దిగలాగుతున్నాయి

గేట్ గేట్ దగ్గర ఒరిగిపోయాడు — ఏవేవో రంగు రంగుల్లోంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి—

'ఒరే నాయనా .. ఒరే బాబూ .' అని ఎవరో అన్నట్టయింది

నెమ్మదిగా కళ్లు తెరిచాడు. కొంచం చూశాడు—

బాగా చూశాడు ...

ఆశ్చర్యపోయాడు.

ఎవరో పెద్దాయన—పెద్దాయన— తనని పిలుస్తున్నాడు — నిజంగా పిలుస్తున్నాడు ఒక్కసారి ఓపిక చేరించి — లేచి కూర్చున్నాడు అయనకేసి చూశాడు ఖరీదైన బట్టలు వేసుకున్నాడు ఒక బెడ్డింగ్ తీసుకుని నిలబడి ఉన్నాడు

'ఒరేయ్, ఇక్కడ రిక్షాలు లేవురా. బయట వానబడి తగ్గాక, ఈ బెడ్డింగ్ ఊళ్లోకి తెస్తావా—ఓ పావలా డబ్బులిస్తా—'

గుండుగాడి నరాలు కుంగిపోయాయి ఆయన మాటకి — ఎమా ధానం చెప్పకుండా ఒరిగి నిద్రపోయాడు

'నేస్టి ఫెలోస్—' అని సణుక్కుని ఆయన బయటికి వెళ్లిపోయాడు

కుంటికుక్క మూలుగుతూ వచ్చి ఒళ్లో పడుకుంది.

క్రమ క్రమంగా వెలుగురేకలు విడుతున్నాయి

* * *

మళ్లీ ఏదో బండి వస్తోన్న అలికిడి జనసందడివిని లేచాడు—

బద్ధకంగా — ప్రాణం పోయే నీరసంతో లేచాడు—

దూరంగా బండి వస్తో కనిపించింది. ఇంతలో హఠాత్తుగా సూరిగాడు పరిగెట్టుకుంటూ ప్లాట్‌ఫారంమీదికి వచ్చాడు వెనకాల ఓ పోలీసు తరుముకొస్తున్నాడు.

రైలు బాగా దగ్గరగా వస్తోంది.

గుండుగాడు ఏడుస్తూ పరిగెత్తాడు సూరిగాడు వెళ్లినవైపు

సూరిగాడు, అవతలి లైన్‌మీదికి దూకబోయాడు

స్టేషన్ అంతా గందరగోళంగా అరిచారు. రైలువచ్చి ఆగింది

రైలుకింద సూరిగాడు ఆగిపోయాడు. అంతా మూగారు.

బయటికి లాగారు

గుండుగాడు గొల్లున ఏడిచి పోతున్నాడు. సూరిగాడి జేబులో పర్సు తుక్కు అయి పోయింది.

అందులో పర్సు బరువుతప్ప ఉన్ననోటు అయిదు రూపాయలు మాత్రం.

అంతా జాలిపడ్డారు.

రైలు కొంచం సేపాగింది

గుండుగాడు కంపార్టుమెంట్లు వెతకలేదు కుంటికుక్క ఏడుస్తూ వెళ్లిపోయింది

బండి కదిలింది—

గుండుగాడు ఏడుస్తున్నాడు.'

మసక మసకగా, కన్నెటి పొరమాటున ఖరీదైన మెయిల్‌బండి కదిలిపోయింది. ●

